ప్రజాస్వామ్యాన్ని కాపాడే సత్తా బీఆర్‌ఎస్‌కే..

● ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత



రొట్టెలు కాలుస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బంజారాహిల్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని కాపాడే సత్తా కేవలం బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందని ఆ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. ప్రచారంలో భాగంగా రాజ్యసభ సభ్యుడు పద్దిరాజు రవిచంద్రతో కలిసి ఆమె శ్రీనగర్‌కాలనీ, కమలాపురి కాలనీలో శుక్రవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాలను కొనసాగించేందుకు తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. వెంగళరావునగర్, మధురానగర్‌లో ఆమె మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి ప్రచారం నిర్వహించారు.

పలుచోట్ల పాదయాత్రలు

బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతకు మద్దతుగా పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాదయాత్రలు నిర్వహించారు. శ్రీరామ్‌నగర్ మసీదు వద్ద ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ షఫీ ప్రచారం చేశారు. బోరబండ బంజారానగర్‌లో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు

ఎర్రగడ్డ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జహర గుల్షన్ బాగ్, నంద నగర్, వేంకటేశ్వర కాలనీ, కళ్యాణ్ నగర్, గోకుల్ థియేటర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, క్రాంతికిరణ్, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, బీఆర్‌ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి, నాయకులు కంజర్ల పల్లవి మహేందర్ యాదవ్, చంద్రశేఖర్, కళ్యాణి, అర్చన, జులేఖ, రజియా, సెబాస్టియన్, సయ్యద్ రసూల్, ఉష, జావిద్, మహబూబ్, ఖురేషి, హర్షద్ పాల్గొన్నారు.



ఎర్రగడ్డలో దుకాణాదారుడికి కరపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న పతాని రామకృష్ణగౌడ్

పంజాగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ తమ పోరాటం ఆగదని బీసీ సాధికారిత సమితి చైర్మన్ పతాని రామకృష్ణగౌడ్ తెలిపారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు నేడు 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్ అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కులాలకు అతీతంగా నేటి ధర్నాలో పాల్గొనాలని, గ్రామ స్థాయి నుంచి నిరసన ర్యాలీ చేపట్టాలని, అప్పుడే ఢిల్లీకి సెగ తగులుతుందని అన్నారు. బీసీల్లోని 136 కులాలు ఇప్పటికీ చట్టసభల గడప తొక్కలేదని అన్నారు. బీసీ మంత్రి కొండా సురేఖ ఇంటికి అర్ధరాత్రి పోలీసులను పంపించిన తీరు సరికాదని అన్నారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం పటేల్ నగర అధ్యక్షుడు ఆర్వీ మహేందర్, గురురాజు, తోట శ్రవణ్, నిరంజన్ పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సంఘం, వివిధ సంఘాల నాయకులు

ఎంబీసీల వాటా తేల్చండి

పంజాగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లలో అత్యంత వెనుకబడిన కులాలు(ఎంబీసీ) వాటా తేల్చాలని తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సంఘం, వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోగికార్ సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు సత్యం వంశరాజ్, వివిధ సంఘాల నాయకులు మోహన్ బైరాగి, ఎం.గురుచరణ్, చింత స్వామి, తదితరులు మాట్లాడారు. ఎంబీసీల జనాభా నిష్పత్తి ప్రకారం 'మేమెంతో-మాకంత వాటా' కేటాయించాలి అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నేటి రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రాచకొండ రమేష్, వెంకటాచారి, ఎం.సోమన్న, పాపని నాగరాజు, నిమ్మల వీరన్న, సురేష్, నగేష్, సుమిత్రాబాయి, జీజే రాజా పాల్గొన్నారు.

బంద్‌కు సంపూర్ణ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

యూసుఫ్‌గూడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేడు జరిగే బీసీల బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బంద్‌కు వాణిజ్య, వ్యాపార సంస్థలన్నీ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, పద్మయ్య, సతీష్, లత, తిరుపతి, ఓలా శివకుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ నామినేషన్ ర్యాలీ సందర్భంగా స్వాగత వేదికపై పార్టీ కార్యకర్తలతో అభివాదం పలుకుతున్న మాజీ కార్పొరేటర్లు గుర్రం మురళిగౌడ్, సంజయ్‌గౌడ్, ఆదిలక్ష్మి, కళ్యాణి

● యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి



పూజలు చేస్తున్న ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

భాషా సాంస్కృతిక శాఖలో దీపావళి వేడుకలు

రవీంద్రభారతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యాలయంలో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించి సిబ్బందితో కలిసి దీపాలు వెలిగించారు. కార్యాలయం మొత్తం రంగురంగుల దీపాలతో ఆకర్షణీయమైన అలంకరణలతో కళకళలాడింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ అంధకారంపై వెలుగు గెలిచిన పండుగ దీపావళి అని అన్నారు. మన జీవితాల్లో సానుకూలత, సహకారం భావాలను వెలిగించాలన్నారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, శాఖ అధికారులు రఘునందన్, విజయ్‌కుమార్, నర్సింహులు, ప్రసాద్‌బాబు, శ్రీనివాస్, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లే

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బోరబండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ కు వేసిన ఓటు మూసీలో కలిసినట్లేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చివరకు ఆ పార్టీ ఎలాగూ కాంగ్రెస్‌తోనే కలుస్తుందని చెప్పారు. శుక్రవారం రాత్రి జరిగిన రహ్మత్ నగర్ డివిజన్ బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా పోటీ చేసే మజ్లిస్ పార్టీ జూబ్లీహిల్స్‌లో అభ్యర్థిని నిలబెట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్‌తో మజ్లిస్ దోస్తానా కొనసాగుతోందని, గతంలో ఎంఐఎం నుంచి పోటీచేసిన వ్యక్తి ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అందుకు నిదర్శనమని చెప్పారు. నగరానికి మజ్లిస్ పార్టీ అభ్యర్థి మేయర్ అయితే ఇబ్బంది అవుతుందని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కారుకు మద్దతుగా జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలిసారి ఓటు హక్కు పొందిన రహ్మత్ నగర్ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ రహ్మత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు టి.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతంరావు, బంగారు శృతి, ఎస్.మల్లేష్ గుప్తా, కనకరాజు, రామ్‌ధారి బాబు, చింటు, భరత్‌గౌడ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవిష్యత్తుతో ముడిపడిన ఉప ఎన్నిక

● బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



షేక్‌పేటలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఒక నియోజకవర్గానికి సంబంధించినది కాదని, తెలంగాణ భవిష్యత్తుతో ముడిపడి ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం షేక్‌పేట డివిజన్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ పాగా వేస్తుందనే ఆశాజనక వాతావరణం ఏర్పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా మోదీ ప్రభంజనంతో అనేక చోట్ల బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, తెలంగాణలో బీజేపీ ప్రభంజనం వీస్తుందని పేర్కొన్నారు. మజ్లి‌స్‌ను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పెంచిపోషించాయని, వారి అండ చూసుకొని ఆ పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మజ్లిస్ ఆగాడాలను అరికట్టాలంటే జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం సాధించాలన్నారు. గత ఎన్నికల్లో మజ్లిస్ ఇక్కడి నుంచి పోటీ చేసి 40వేల ఓట్లు సాధించిందని, ఇప్పుడు ఎందుకు పోటీచేయడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పోటీ చేయకపోవడం కాంగ్రెస్ పన్నాగంగా పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వంలో అనివర్గాల వారు లబ్ధి పొందుతున్నారన్నారు. యోగి తరహా పాలన తెలంగాణలో ఏర్పడి మజ్లిస్ అరాచకాన్ని అడ్డుకోవాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో శ్రీవాత్స

హెచ్‌ఎండీఏలో ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవాత్స కోట ప్రారంభించారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా ఉద్యోగులు ఆరోగ్య, కంటి, దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరం సందర్భంగా నమోదు చేసుకున్న ఉద్యోగులకు సమగ్ర హెల్త్ చెకప్ ప్యాకేజీలపై 50 శాతం నుంచి 65శాతం వరకు రాయితీని విజయ డయాగ్నస్టిక్ సెంటర్ అందించింది. అమెరికన్ లేసర్ ఐ హాస్పిటల్, క్లోవ్ డెంటల్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు 11కేవీ ఎమ్మెల్యే కాలనీ ఫీడర్ పరిధి, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ అంబేడ్కర్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ టీకే గూడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బేగంపేట పోస్టాఫీస్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

వాకింగ్‌కు వెళ్లి వచ్చే సరికి చోరీ

బంజారాహిల్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లి వచ్చేసరికి ముగ్గురు యువతులు ఇంట్లో ఉన్న నగదు, నగలు చోరీ చేశారు. కృష్ణానగర్‌కు చెందిన కర్రి మోహన్ ఓ హోటల్‌లో మాస్టర్ చెఫ్. ఈ నెల 16న ఆయన ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి ముగ్గురు యువతులు ఇంట్లో నుంచి బయటకు రావడం గమనించాడు. మోహన్‌ను చూడగానే వారు పారిపోయారు. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.60 వేల నగదు, 120 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నటి నాగమణిని సత్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

నాటక రంగం అభివృద్ధికి దుగ్గిరాల కృషి

రవీంద్రభారతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాటక రంగం అభివృద్ధికి దుగ్గిరాల సోమేశ్వరరావు చేసిన కృషి ఎనలేనిదని విశ్రాంత ఐఏఎస్ డా.కేవీ రమణాచారి అన్నారు. శుక్రవారం రసరంజని సంస్థ, దుగ్గిరాల ఫ్యామిలీ సంయుక్త ఆధ్వర్యంలో నటుడు, దర్శకుడు దివంగత దుగ్గిరాల సోమేశ్వరరావు 93వ జయంతిని నిర్వహించారు. నాటక రంగానికి చెందిన శశిమోహన్, నాగమణి, రాయప్రోలు భగవాన్‌ను ఆత్మీయ పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈతరం నటులకు ఆదర్శప్రాయులు దుగ్గిరాల సోమేశ్వరరావు అని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డీజీపీ హెచ్‌జే దొర, డి.ఎస్.ఎన్.మూర్తి, అమరేంద్ర, దీర్ఘాసి విజయభాస్కర్ పాల్గొన్నారు. సభకు ముందు మల్లీశ్వరి ఆర్ట్స్ వారిచే 'నువ్వొసగం - నేనొసగం' నాటిక ప్రదర్శించారు.



మన్నెం శారదను సత్కరిస్తున్న నిర్వాహకులు

మన్నెం శారదకు సాహిత్యభారతి పురస్కారం

రవీంద్రభారతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ 45వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు సాహిత్యంలో తమదైన ముద్ర వేసిన మహనీయులకు సాహిత్య భారతి జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం సంస్థ కార్యాలయంలో సాహితీవేత్త మన్నెం శారదకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో అర్చన సంస్థ వ్యవస్థాపకురాలు ఉమాభారతి, ప్రవీణ సూర్యదేవ, జ్యోతి వలబోజు తదితరులు శారదను ఘనంగా సత్కరించి అభినందించారు. సాహిత్య రంగంలో మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

మార్కెట్‌లో దీపావళి సందడి

● ఊపందుకున్న ప్రమిదలు, స్వీట్ల విక్రయాలు
● కొనుగోలుదారులతో రద్దీగా దుకాణాలు

ఖైల్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'చీకటి వెలుగుల రంగేళీ జీవితమే ఒక దీపావళి' అని మహాకవి మానవ జీవితాన్ని దీపావళితో పోల్చారు. ఏడాదికోమారు వచ్చే పండుగల్లో దేశవ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకునే పండుగ దీపావళి. చిన్నా పెద్ద, బీద, గొప్ప తేడా లేకుండా ఆనందంగా జరుపుకునే పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రతీ ఇంట్లో వెలుగులను నింపే జ్యోతులు, ప్రమిదలు, ఇంటింటా జరుపుకునే పేరంటాల్లో కొలువు దీరే లక్ష్మీదేవి విగ్రహాలు విక్రయాలకు సిద్ధమయ్యాయి. ప్రజలందరూ సంతోషంగా జరుపుకునే దీపావళి మూడు రోజులు మాత్రమే ఉండడంతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది. కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. శేరిలింగంపల్లి, చందానగర్, బీహెచ్‌ఈఎల్, మియాపూర్, గచ్చిబౌలి తదితర ప్రధాన ప్రాంతాల్లో మట్టి ప్రమిదలు, కుండలు, విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి.

నోరూరించే పంచదార చిలకలు..

దీపావళి అంటేనే మిఠాయిల పండుగ. మిఠాయిలతో పాటు దీపావళికి ప్రత్యేకంగా పంచదారతో తయారు చేసే చిలకలు, పంచదార బొమ్మల కొనుగోళ్లు అధికంగా జరుగుతుంటాయి. పండుగ నేపథ్యంలో పంచదార మిఠాయిల విక్రయాలు ఊపందుకున్నాయి. కిలో రూ.150 నుంచి రూ.250 వరకు విక్రయాలు జరుగుతుండగా, ప్రజలు విభిన్న మిఠాయిలను కొనుగోలు చేస్తున్నారు. లింగంపల్లి ప్రధాన మార్కెట్‌తో పాటు స్వీట్ దుకాణాల్లో పంచదార మిఠాయిల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.



అమ్మకానికి ఉంచిన నోరూరించే మిఠాయిలు

మట్టి ప్రమిదలే శ్రేష్ఠం..

ప్రకృతి సిద్ధమైన మట్టితో తయారు చేసిన ప్రమిదల్లో జ్యోతులను వెలిగించడమే శ్రేష్ఠమని వేదాలు ఘోషిస్తుండగా, కళ్లకు ఎటువంటి హాని కలిగించని మట్టి ప్రమిదలే మంచివని వైద్యులు సూచిస్తున్నారు. మట్టితో తయారు చేసిన ప్రమిదల్లో దీపాలను వెలిగించడం వల్ల వెలువడే కాంతి కళ్లకు హాని చేయదని, మట్టిలో నూనె కాలడం వల్ల వెలువడే కాంతులకు క్రిములు నశిస్తాయని చెబుతున్నారు. రంగురంగుల ప్రమిదలపై వేసే రసాయనాలు కలుషిత వాతావరణం సృష్టిస్తాయని, చర్మ వ్యాధులు, కళ్ల జబ్బులు, గొంతు, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని నిపుణులు పేర్కొంటున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు, కుండలు

విద్యుత్ కాంతుల్లో అన్నానగర్ చౌరస్తా

- హైమాస్ట్ లైట్ల ఏర్పాట్లలో కంటోన్మెంట్ అధికారులు
- ఇప్పటి వరకు సరైన వీధిదీపాలు లేక ప్రజల ఇక్కట్లు
- రాత్రివేళలో తొలగనున్న ప్రయాణ ఇబ్బందులు


అన్నానగర్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సికింద్రాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది మంది ప్రజలు, వందలాది వాహనాలు రాకపోకలు సాగించే అన్నానగర్ చౌరస్తా ఇక నుంచి విద్యుత్ వెలుగులు విరజిమ్మనుంది. కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ చొరవతో కంటోన్మెంట్ బోర్డు అధికారులు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

విషయానికొస్తే.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని మూడో వార్డులో అన్నానగర్ జంక్షన్ ఉంది. ఈ జంక్షన్ నుంచి అన్నానగర్, అర్జున్‌నగర్, శ్రీలంక బస్తీ, ఇందిరమ్మనగర్, చంద్రబాబునాయుడునగర్, బాలంరాయి, ఈద్గా, అంబేద్కర్‌నగర్, ప్యారడైజ్, తాడ్‌బందు, సిక్‌విలేజీ, బోయినపల్లి తదితర ప్రాంతాలకు నిత్యం వేలాది మంది ప్రజలు ప్రయాణిస్తుంటారు. అలాగే వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ జంక్షన్‌లో సరైన వీధి దీపాలు లేకపోవడంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు, స్థానిక నాయకులు చాలాకాలంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నానగర్ జంక్షన్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు అధికారులకు చాలా సార్లు విజ్ఞప్తి చేశారు. కొద్ది రోజుల క్రితం శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి, కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులతో మాట్లాడగా అధికారులు హైమాస్ట్ లైట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం వాటిని అమర్చుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


అన్నానగర్ జంక్షన్ చుట్టుపక్కల చాలా బస్తీలు ఉన్నాయి. కూలీలు, కార్మికులు, రిక్షా కార్మికులు, ఆటోవాలాలు ఎక్కువ నివసించే ప్రాంతాలు పైగా నిత్యం అన్నానగర్ చౌరస్తా మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి పూట ఈ చౌరస్తా అంధకారంగా ఉండడంతో ప్రమాదాలు తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎమ్మెల్యే మా గోడు విని కంటోన్మెంట్ బోర్డు అధికారులతో మాట్లాడి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. ఆయనకు అన్ని బస్తీల తరఫున కృతజ్ఞతలు.

పెద్ద నాగరాజు
(కార్మిక సంఘ నాయకుడు)

ఇది దీపావళి కానుకే


అన్నానగర్ జంక్షన్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తుండటం సంతోషం. చాలాకాలంగా వాటి కోసం కంటోన్మెంట్ బోర్డు అధికారులకు మొర పెట్టుకుంటున్నాం. ఇప్పుడు ఏర్పాటు చేస్తుండడం మాకు శ్రీగణేష్ తరఫున దీపావళి కానుకగా భావిస్తున్నాం. ఎమ్మెల్యేతో పాటు కంటోన్మెంట్ బోర్డు అధికారులకు కూడా ధన్యవాదాలు.

అన్నానగర్ మురళి,
స్థానిక కాంగ్రెస్ స్థానికుడు


వస్త్రాలను తిలకిస్తున్న వినియోగదారులు

చేనేత హస్తకళ.. భళా

తార్నాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చేనేత హస్తకళా ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేయగా ఇందులో ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందుబాటులోకి తెచ్చారు. శుక్రవారం ఎగ్జిబిషన్ నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ, సమాజంలో అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా విభిన్న రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంచిపట్టు చీరలు, మంగళగిరి హ్యాండ్లూమ్స్ ఉప్పాడ, పోచంపల్లి చీరలు, బెడ్ షీట్స్ వెస్ట్ బెంగాల్ జాంధాన్ని చీరలు, రాజస్థానీ కోటా చీరలు, వెంకటగిరి, ధర్మవరం చీరలు, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చెకెన్ వర్క్ కుర్తీస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలో పెట్టామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న సిల్క్ వస్త్ర ఉత్పత్తి కేంద్రాలకు చెందిన కార్మికులు, హస్త కళాకారులు నేరుగా ఇందులో వారి ఉత్పత్తులను ప్రదర్శించారని తెలిపారు. నవంబర్ 3 వరకు ప్రదర్శన అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలను కొని కార్మికులను మరింత ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

రెండు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


సునీతాదీప్తిక


రామ్‌రెడ్డి

బౌద్ధనగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): రెండు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. తల్లి మందలించిందని కూతురు, పనికెళ్లి తిరిగొచ్చే లోపు భర్త అదృశ్యమయ్యారు. ఈ సంఘటనలు చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మారావునగర్ వెంకటాపురానికి చెందిన సునీతాదీప్తిక(42) ఇంట్లో ఖాళీగా ఉంటోంది. లోన్‌యాప్‌లో రుణం తీసుకుంది. ఆ డబ్బులు కట్టడానికి బంధువుల వద్ద ఐదు వేల రూపాయలు అప్పు తీసుకుంది. ఈ విషయం తెలిసిన తల్లి తన కుమార్తెను మందలించగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మనస్తాపం చెందిన యువతి ఈనెల 11న మొబైల్ ఇంట్లో పెట్టి వెళ్లిపోయింది. ఆమె కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తమ్ముడు మేఘశ్యాం గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు సైతం..

చిలకలగూడలో దంపతులు రామ్‌రెడ్డి(75), డి.విమలమ్మ నివాసం ఉంటున్నారు. రోజూ భర్తను స్థానికంగా వెస్లీ చర్చి సమీపంలో కూర్చోబెట్టి ఇళ్లల్లో పని చేసి తిరిగొచ్చేటప్పుడు వెంటబెట్టుకొని తీసుకెళ్తున్నది. ఈనెల 15న కూడా అలాగే అతడిని కూర్చోబెట్టి పనికి వెళ్లి వచ్చేసరికి కనిపించకుండాపోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం రాత్రి భర్త అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సూపరింటెండెంట్ వాణికి వినతి పత్రం సమర్పిస్తున్న నర్సింహ, నర్సులు

ఔట్‌సోర్సింగ్ నర్సులకు జీతాలు చెల్లించాలి

- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ

అడ్డగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నర్సులకు వెంటనే జీతాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహతో పాటు ఔట్‌సోర్సింగ్ నర్సులు అన్నారు. శుక్రవారం గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ ఆస్పత్రిలో 20 ఏళ్లుగా ఔట్ చాలీచాలని జీతాలతో సోర్సింగ్ నర్సులు పనిచేస్తున్నారన్నారు. వారికి జూలై నుంచి నేటి వరకు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించలేదన్నారు. అతను వాటిని చెల్లించడంలో విఫలమైతే ముఖ్య యజమానిగా ఉన్నటువంటి ఆస్పత్రి సూపరింటెండెంట్.. నర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లించాలని కాంట్రాక్ట్ చట్టం సూచిస్తుందన్నారు. ఇప్పటికైనా బకాయి జీతాలు వెంటనే చెల్లించేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు సుందరమ్మ, నాగమణి, అనిత, పుణ్యమ్మ, శోభారాణి, లక్ష్మి, ప్రభలత, రాజేశ్వరిలు ఉన్నారు.

నేటి రాష్ట్రబంద్‌కు తరలిరండి


రాంగోపాల్‌పేట్: మాట్లాడుతున్న యాదగిరి

తార్నాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న తెలంగాణ బంద్‌లో బడుగు బలహీనవర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు భైరు నాగరాజు గౌడ్ శుక్రవారం పిలుపునిచ్చారు. సబ్బండ వర్గాల ప్రజలందరూ సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాకుండా తమ వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, రవాణా వ్యవస్థ, పెట్రోల్ బంక్‌లు, సినిమా థియేటర్‌లు స్వచ్ఛందగా బంద్ చేసి సహకరించాలన్నారు.

సంపూర్ణ మద్దతు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల జేఏసీ రాష్ట్రబంద్‌కు దళిత జనసమితి (డీజేఎస్) సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని డీజేఎస్ రాష్ట్ర వ్యవస్థాపకాధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత బొజ్జ యాదగిరి తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ రాణిగంజ్ బాంబే హోటల్ దగ్గర దళిత జన సమితి ఆధ్వర్యంలో బీసీల రాష్ట్ర బంద్‌కు మద్దతుగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సమావేశంలో దళిత జనసమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిడిశెట్టి చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకా చంద్రారెడ్డి తదితరులు

ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి

తార్నాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాణికేశ్వర్ నగర్ ఫేజ్ 2లో ఉన్న సాయిబాబా టెంపుల్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకా చంద్రారెడ్డి కోరారు. శుక్రవారం కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి ఆమె వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల రైల్వే అధికారులు మాణికేశ్వర్ నగర్ ఫేజ్ 2లో ఉన్న సాయి ఆలయం రైల్వే స్థలంలో ఉన్నందున తొలగిస్తామని నోటీసులు ఇచ్చారన్నారు. ఈ దేవాలయం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబీ పనులను త్వరితగతిన చేపట్టేలా చొరవ తీసుకోవాలని, బస్తీలోని లాల్ బహదూర్ కమ్యూనిటీ హాల్‌కు అదనపు అంతస్తు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో సాయిబాబ టెంపుల్ ప్రెసిడెంట్ గుండురెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, బీజేపీ తార్నాక డివిజన్ ప్రెసిడెంట్ ఉపేందర్ యాదవ్, వెంకటేశ్, అయ్యప్ప రెడ్డి, మణిస్వామి, చరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.


క్యూలో ఉన్న ప్రయాణికులతో ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్‌రెడ్డి

రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక డ్రైవ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులెవరూ కూడా ఇబ్బందులు పడకూడదని ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చేపట్టామని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నుంచి దీపావళి పండగ వరకు జనరల్ బోగి వద్ద అరగంట ముందే క్యూ పాటించాలని మైకులో అవగాహన కల్పిస్తున్నామన్నారు. 'జనరల్ బోగీల వద్ద ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఉంటాడు. రైల్వే స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద.. సిబ్బంది సహాయం తీసుకోవచ్చు. ప్రతి ప్లాట్‌ఫాంపై విచారణ కేంద్రాలు, పోలీస్ ఔట్‌పోస్టులు ఏర్పాటు చేశాం. 1,750 నుంచి 2 వేల మంది ప్రయాణికుల సామర్థ్యం గల నాలుగు బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నాయి. ప్లాట్ ఫాంలపై సీసీ కెమెరాలు, డిస్‌ప్లేలు ఏర్పాటు చేశాం. టికెట్ తీసుకున్న ప్రయాణికులనే లోపలికి అనుమతి ఇస్తాం. ఏదైనా సమస్య ఉంటే 139 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రచారం చేస్తున్నాం అని' ఎస్సై తెలిపారు.

చెక్ అందజేత

చిలకలగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ రైల్‌నిలయం అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన వై. దుర్గేశ్వరరావు కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ. 5 లక్షల చెక్‌ను ద.మ.రైల్వే కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు చిలుకుస్వామి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సొసైటీ సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారికి సొసైటీ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ, విష్ణు పాల్గొన్నారు. కాగా, దుర్గేష్ కుటుంబ సభ్యులు కారుణ్య నియామకానికి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.


జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న తలసాని

కాలినడకన శబరిమలకు..

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాలధారణ ఎన్నో జన్మల పుణ్య ఫలం అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ నుంచి శబరిమలకు కాలినడకతో వెళ్తున్న 120 మంది మాలధారుల పాదయాత్రను ఆయన ప్రారంభించారు. 18 సంవత్సరాలుగా పాదయాత్రతో వెళ్తున్న అయ్యప్ప స్వాముల బృందాన్ని ప్రశంసించారు. నవంబర్ 23న శబరిమలకు చేరుకుంటామని పాదయాత్ర బృందం సభ్యుడు వెంకటేష్‌యాదవ్ తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించాలి

సికింద్రాబాద్; అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలంరాయి ఈద్గా అంబేద్కర్‌నగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 50 లక్షల రూపాయల నిధులు కేటాయించాలని కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కోరారు. ఈ మేరకు శుక్రవారం శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌కు వినతి పత్రం సమర్పించారు. స్థానిక నాయకులు ఇల్లందుల శంకర్, చిన్నరాజు, గిరిధర్, కరణ్‌సింగ్ పాల్గొన్నారు.

'కవిత విమర్శలు అర్థరహితం'

సికింద్రాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీని విమర్శించే నైతిక హక్కు కల్వకుంట్ల కవితకు లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి అన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ జాతీయ నాయకత్వం ప్రకటించిందని, ఆ సమయంలో కవిత ఎలాంటి మద్దతు ప్రకటించలేదని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం మెట్టుగూడలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు బీసీలు గుర్తుకొచ్చి, బీజేపీపై తప్పుడు విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బౌద్ధనగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): చెట్లుకొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతుల కారణంగా శనివారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యానగర్ ఏఈ రోచిత తెలిపారు. బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో లలితనగర్, బాలాజీనగర్, అడిక్‌మెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలో వారాసిగూడ కౌసర్ మసీద్ లైన్, పాతబీజేపీ లైన్, బౌద్ధనగర్, ఆర్ట్స్‌కాలేజీ మోర్‌సూపర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అడ్డగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులకు నాణ్యమైన భోజనం అందించాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ క్యాంటీన్‌ను ఆయన తన చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, వినోద్ కుమార్, మురళీధర్, మహేశ్వరి, పావని, స్వామి, సురేష్, సంజీవ్‌కుమార్, సంతోష్, అనిత, సమతలు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలి


అడ్డగుట్ట: ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సికింద్రాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీజేఐపై దాడికి యత్నించిన ఘటనను సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాలని కంటోన్మెంట్ ఇచార్జి శ్రీకిషన్ మాదిగ డిమాండ్ చేశారు. నంగునూరు విశ్వనాథ్, కె.రవికుమార్, బి.నరసింహ, కె.మధు, ప్రవీణ్, పి.బాబేందర్, ఎం.అశోక్, డి.రఘు, కె.పి.సంతు, శ్రీకాంత్, సాయికుమార్, కె.మధుసూదన్, కె.సాయికుమార్, టి.సుదర్శన్, గంగాధర్, నరేష్, అనిల్, సంపత్, గోవర్ధన్, కె.నరసింహ, బాలు, నాని, తేజ పాల్గొన్నారు. అనంతరం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై ఈనెల 7న కిషోర్ అనే న్యాయవాది దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే అతడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ హైద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం అడ్డగుట్ట నుంచి మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎమ్మార్పీఎస్ నేతలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇక్కడే నిరసన వ్యక్తం చేశారు. దాడికి యత్నించిన వ్యక్తిని చట్టపరంగా శిక్షించాలన్నారు. ఈ కేసుపై సీనియర్ న్యాయమూర్తులపై విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి అందే రాంబాబు, ఎంఎస్‌పీ సికింద్రాబాద్ కోఇన్‌చార్జి చెండేటి వేణుగోపాల్, సీనియర్ నాయకులు జోగు దరశథ్, శివప్రసాద్, బలుగులు మహేష్, మెట్టుగూడ ప్రసాద్, వినోద్, శ్రీనివాస్ హోలియా దాసరి, వినయ్, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు భూపతి సుజాత, తినేత్రలు పాల్గొన్నారు.

టీసీఏ సలహాదారుడిగా దత్తాత్రేయ..

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) గౌరవ సలహాదారుడిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను తమ సంఘంలోకి ఆహ్వానించినట్టు కార్యదర్శి డి.గురువారెడ్డి వెల్లడించారు. వచ్చే మూడేళ్లకి గానూ కొత్త కార్యవర్గాన్ని గురువారెడ్డి ప్రకటించారు. చైర్‌పర్సన్‌గా ఎంపీ డీకే అరుణ, అధ్యక్షుడిగా బి.బి.పాటిల్, ఉపాధ్యక్షుడిగా పి.విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారిగా తీగల హరినాథ్ రెడ్డి, ప్రవీణ్ సహాయ కార్యదర్శి, బోర్డు ఆఫ్ ప్యాట్రన్స్‌లో బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎన్.రాంచందర్ రావు, శ్రీరామ్, బోర్డు ఆఫ్ అడ్వైజరీలో బండారు దత్తాత్రేయ, గోపాల్ శర్మ, బి.ఎస్ రెడ్డి, సీవీ రాములును ఎన్నుకున్నట్టు గురువారెడ్డి తెలిపారు.

సీపీఆర్‌పై అందరికీ అవగాహన తప్పనిసరి

అడ్డగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై అందరికీ అవగాహన తప్పనిసరి అని నోడల్ అధికారి డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న సీపీఆర్ అవగాహన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కూడా వైద్య విద్యార్థులకు డెమో ఇచ్చామని మాదాల తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డాక్టర్ అశ్విని పాల్గొన్నారు.

పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విజేత వీరే

అడ్డగుట్ట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ రాంబాబు (అసోసియేషన్ ప్రొఫెసర్ సర్జరీ), డాక్టర్ జీ సందీప్‌రాజ్‌లు.. (అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్జరీ) పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ గెలిచారు. డాక్టర్ దినేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ న్యూరాలాజీ), డాక్టర్ కే. బ్రహ్మేశ్వర్ (మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్) రన్నరప్‌గా నిలిచారు. గాంధీ మెడికల్ కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వారం రోజుల నుంచి వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. శుక్రవారం విజేతలను ప్రకటించారు. సింగిల్స్ విభాగం విన్నర్, రన్నరప్‌గా డాక్టర్ రాంబాబు, అబయ్య (అసోసియేట్ ప్రొఫెసర్ అనస్థీషియా)లు నిలిచారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డాక్టర్ అశ్విని పాల్గొన్నారు. క్రీడల కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వేణు, డాక్టర్ లెనిన్, డాక్టర్ రిషి వర్ధన్‌లు ఉన్నారు.